
సాక్షి
బాపట్ల

శనివారం, 9, మార్చి, 2024



ఎన్నికల ప్రచార రథం ప్రారంభం

వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారాల్లో భాగంగా జయహో జయహో మా బ్రహ్మన్న అనే పాటను, ప్రచార రథాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 514.60 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 3,031, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6500, గరిష్ట ధర రూ.7800, మోడల్ ధర రూ.7200 వరకు పలికింది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్ సంస్కృత మూల్యాంకనం

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సంస్కృత పేపర్ల స్పాట్ వాల్యూయేషన్ ప్రక్రియను శనివారం ప్రారంభిస్తున్నట్లు ఆర్ఐవో జీకే జుబేర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి స్పాట్ వాల్యూయేషన్ ప్రారంభవుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని సంస్కృత అధ్యాపకులందరు తప్పనిసరిగా హాజరు కావాలని, మిగిలిన సబ్జెక్టుల స్పాట్ వాల్యూయేషన్ షెడ్యూల్‌ను బోర్డు ప్రకటిస్తుందని తెలిపారు.

రేపు చేబ్రోలులో రథోత్సవం

చేబ్రోలు : చారిత్రక ప్రసిద్ధి చెందిన చేబ్రోలులోని గంగాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారి రథోత్సవ కార్యక్రమం ఆదివారం జరుగుతుందని దేవదాయ శాఖాధికారి పోతుల రామకోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. మహాశివరాత్రి పండుగ రోజున నాగేశ్వర స్వామి, గంగా పార్వతి అమ్మవార్ల కల్యాణ మహోత్సవంను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 3 గంటలకు స్వామివారి రథోత్సవం జరుగుతుందని తెలిపారు.

దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు పట్టు వస్త్రాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై జరిగే దుర్గామల్లేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవానికి మంగళగిరి చేనేత పట్టువస్త్రాలను శుక్రవారం సమర్పించారు. శ్రీ శివ భక్త మార్కండేయ వంశీకులు ప్రతి ఏడాది మహా శివరాత్రికి పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీ. మార్కండేయ ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యులు గంజి చిరంజీవి, రాధ దంపతులు, చిల్లపల్లి శ్రీనివాసరావు, గౌరీ దంపతులు అమ్మవారికి, అయ్య వార్లకు పట్టువస్త్రాలను తీసుకుని ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కెఎస్.రామారావు సాదరంగా స్వాగతం పలికారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకుని అమ్మవారిని, మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకుని వస్త్రాలను సమర్పించారు. పట్టు వస్త్రాలను భక్తి శ్రద్ధలతో చేనేత మగ్గాలపై వారం రోజుల పాటు తయారు చేశామని పేర్కొన్నారు. చిల్లపల్లి మోహనరావు, అందే నాగప్రసాద్, గుత్తికొండ ధనుంజయరావు, అవ్వారు శ్రీనివాసరావు, బిట్రా శ్రీనివాసరావు, వేణు, ట్రస్ట్ సభ్యుల కుటుంబీకులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై మహా శివరాత్రి రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రిని పురస్కరించుకుని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి సన్నిధిలో స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం, మహా శివరాత్రి నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న ఆది దంపతులను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము మూడు గంటల నుంచే దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మల్లేశ్వరాలయానికి చేరుకుని స్వామి వారికి విశేష అభిషేకాలు జరిపించుకున్నారు. శివరాత్రిని పురస్కరించుకుని అమ్మవారి ఆలయంతో పాటు మల్లేశ్వర స్వామి ఆలయాన్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరి ఉండటంతో సర్వ దర్శనం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులను రూ.100, రూ.300 టికెట్ క్యూలైన్లలోకి ఉచితంగా అనుమతించారు. మల్లేశ్వర స్వామి వారి సన్నిధిలో భక్తులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సుమారు వంద మందికి పైగా ఉభయదాతలు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆది దంపతులను దర్శించుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలో అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

దివ్యోత్సవం...శివోత్సవం

హరహరో...హరహర మహాదేవ...శంభో శంకర అంటూ భక్తులు చేసిన నామస్మరణతో జిల్లాలోని శైవక్షేత్రాలు హోరెత్తాయి. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామిని దర్శించుకుని తరించారు. రైతులు తమ పశువులను ఆలయాల చుట్టూ తిప్పి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ ఏటికి ఇద్దరం...ముందు నాటికి ముగ్గురం అంటూ నవదంపతులు శివయ్యను స్మరించుకుంటూ మొక్కుబడులు చెల్లించుకున్నారు.

అరవపల్లిలో..

రేపల్లె రూరల్: రేపల్లె మండలం అరవపల్లి గ్రామంలో వేంచేసియున్న బాలకోటేశ్వరస్వామి తిరునాళ్ల శుక్రవారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే స్వామివారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ఆలయం వద్ద బారులు తీరారు. ఆలయ ఆవరణలో అర్చకులచే నిర్వహించిన ప్రత్యేక రుద్రాభిషేక మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. యువత ప్రభలను కట్టి భక్తిశ్రద్ధలతో డప్పువాయిద్యాల నడుమ ఆలయం వద్దకు చేరుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. మహిళా భక్తులు ఆలయ ఆవరణంలో పొంగళ్లు పెట్టి స్వామికి నివేదించారు. ఆలయ ఆవరణంలో వెలసిన గొల్లబామ పేరంటాళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రంగుల రాట్నం, బొమ్మల దుకాణాలు, తినుబండారాల దుకాణాలు జనంతో కిటకిటలాడాయి. పలు సేవా సంఘాలు తాగునీరు, మజ్జిగ, అల్పాహారాలను భక్తులకు పంపిణీ చేశారు. డీఎస్పీ టీ.మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు తిరునాళ్లలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. మోళ్లగుంట, విశ్వేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారులు వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి సేవలు అందించారు. తుమ్మల, బొబ్బర్లంక పశు వైద్యాధికారులు పశువులకు అవసరమైన వైద్యసేవలు అందించారు.



అరవపల్లిలో బాలకోటేశ్వరస్వామికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న భక్తులు



బాలకోటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎంపీ మోపిదేవి, గణేష్



ప్రత్యేక పూజలందుకుంటున్న అరవపల్లి బాలకోటేశ్వరస్వామి

గోవాడలో..

గోవాడ(వేమూరు): మహాశివరాత్రి సందర్భంగా గోవాడకు భక్తులు పోటెత్తారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బాల కోటేశ్వరస్వామి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులుతీరారు. వేమూరు నియోజకవర్గంలోని అమర్తలూరు మండలం గోవాడ గ్రామంలో బాలకోటేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున నుంచి భక్తులు బాల కోటేశ్వరస్వామి దర్శనం కోసం క్యూలైన్లలో బారులుతీరారు. భక్తుల రద్దీ క్రమబద్ధీకరించేందుకు డీఎస్పీ, ముగ్గురు సీఐలు, పది మంది ఎస్ఐలు, 150 మంది పోలీసులను నియమించారు. ఉదయం వైఎస్సార్ సీపీ నియోజకవర్గం సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు దంపతులు బాలకోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్వామికి నూతన వస్త్రాలు బహుకరించారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని ఆలయ కమిటీకి సూచించారు. రాత్రికి భక్తుల రద్దీ పెరుగుతుందని, అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు సూచించారు. ఆలయం ఆవరణలో భక్తులకు ఉచితంగా ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని సందర్శించారు. వివిధ సంఘాల వారు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. దేవస్థానం చైర్మన్ ఆలపాటి రమాదేవి, వరికూటి లక్ష్మి, పార్టీ మండల అధ్యక్షులు యలవర్తి సురేష్, మోదుకూరి హరిబాబు, అజయ్‌బాబు, దేవస్థానం ఈవో ఈమని అశోక్‌రెడ్డి, వీరభద్ర శ్రీనివాస్‌రెడ్డి, రత్తయ్య, చౌదరి పాల్గొన్నారు.

వారం రోజులపాటు ఉత్సవాల నిర్వహణ

అమర్తలూరు మండలం గోవాడ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో వారం రోజులపాటు మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని దేవస్థానం ఈవో ఈమని అశోక్ రెడ్డి చెప్పారు. గతేడాది మహాశివరాత్రి శ్రీబాల కోటేశ్వరస్వామి దర్శనం కోసం భక్తులు రెండు లక్షల మంది వచ్చారని, ఈ ఏడాది మూడు రోజుల ప్రభుత్వం సెలవులు రావడంతో భక్తులు రద్దీ పెరిగిందన్నారు. రాత్రి సమయానికి దేవుని దర్శనం కోసం భక్తులు రద్దీ అధికంగా పెరుగుతుందని చెప్పారు.

ప్రత్యేక బస్సు సర్వీసులు

మహాశివరాత్రి భక్తులకు ప్రభుత్వం బస్సు సౌకర్యం కల్పించింది. ఆర్టీసీ 48 గంటలు బస్సు సౌకర్యం కల్పించింది. రేపల్లె, పొన్నూరు, బాపట్ల డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు. తెనాలి డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు. ఆలయం ఉత్తరం వైపు తాత్కాలికం డిపో ఏర్పాటు చేశారు.



గోవాడ బాల కోటేశ్వరస్వామి దేవస్థానంలో క్యూలైనులో ఉన్న భక్తులు



స్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న వరికూటి దంపతులు



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం



క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

- రాష్ట్రస్థాయి మహిళల హాకీ క్రీడా పోటీలు ప్రారంభం
- రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి పాల్గొన్న హాకీ క్రీడాకారిణిలు
- 8 నుంచి 10వ తేదీ వరకు మైనంపాడులో పోటీలు నిర్వహణ

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడా పోటీలకు అత్యంత ప్రాధాన్యమిచ్చి ప్రోత్సహిస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూలు ప్రాంగణంలో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న 14వ రాష్ట్రస్థాయి హాకీ సీనియర్ మహిళల క్రీడా పోటీలను మంత్రి మేరుగు నాగార్జున ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ మహిళా దినోత్సవం రోజునే మహిళల రాష్ట్రస్థాయి హాకీ పోటీలు తన అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో జరగటం చాలా సంతోషంగా ఉందన్నారు. పోటీల్లో మహిళలు తమ ప్రతిభ చాటి రాణించాలన్నారు. తొలుత వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారిణులతో ప్రదర్శించిన పరేడ్‌లో మంత్రి నాగార్జున గౌరవ వందనం స్వీకరించారు. ఈ పోటీలు 8 నుంచి 10వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి.

మొదటి రోజు విజేతల జట్లు వివరాలు

మొదటి రోజు నిర్వహించిన హాకీ పోటీల్లో ఏడు జట్లు పాల్గొన్నాయి. మొదటి మ్యాచ్‌లో కాకినాడ-ఏలూరు జట్లు పోటీపడగా కాకినాడ జట్టు విజేతగా నిలిచింది. రెండో మ్యాచ్‌లో తిరుపతి-కర్నూలు జట్లు పోటీపడగా తిరుపతి జట్టు విజేతగా నిలిచింది. మూడో మ్యాచ్‌లో వైఎస్సార్ కడప-గుంటూరు జట్లు పోటీపడగా వైఎస్సార్ కడప జట్టు విజయం సాధించింది.

నాలుగో మ్యాచ్‌లో ప్రకాశం-ఎన్టీఆర్ జిల్లాల జట్లు పోటీపడగా ప్రకాశం జట్టు విజేతగా నిలిచింది. 5వ మ్యాచ్‌లో నెల్లూరు-శ్రీకాకుళం జట్లు పోటీపడగా శ్రీకాకుళం జట్టు గెలిచింది. 6వ మ్యాచ్‌లో తిరుపతి-ఏలూరు జట్లు పోటీపడగా తిరుపతి జట్టు విజయం సాధించింది. 7వ మ్యాచ్‌లో కాకినాడ-కర్నూలు జట్లు పోటీపడగా కాకినాడ విజేతగా నిలిచిందని పోటీల నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఏపీ హాకీ అధ్యక్షుడు చాణక్యరాజు, ట్రెజరర్ థామస్ పీటర్, డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు, హాకీ క్లబ్ కార్యవర్గ సభ్యులు టీ.రవి, పలు జిల్లాల నుంచి క్రీడాకారిణిలు, కోచ్‌లు పాల్గొన్నారు.

సిద్ధం సభకు పటిష్ట బందోబస్తు



పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న గుంటూరు రేంజి ఐజీ జీ.పాలరాజు

గుంటూరు రేంజి ఐజీ పాలరాజు సూచనలు

మేదరమెట్ల: బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పీ.గుడిపాడు జాతీయ రహదారి సమీపంలో ఆదివారం నిర్వహించనున్న సిద్ధం సభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతున్న సందర్భంగా పోలీసు అధికారులు పటిష్ట బందోబస్తు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు గుంటూరు రేంజి ఐజీ పాలరాజు, అడ్మిన్ ఐజీ ఎం.రవీంద్రనాథ్‌బాబు, ఎస్పీ వకుల్ జిందాల్ మేదరమెట్లలో శుక్రవారం పోలీసు అధికారుల సమావేశంలో వెల్లడించారు. జిల్లా పోలీసు అధికారులు తీసుకుంటున్న బందోబస్తు గురించి ఎస్పీ వివరించారు. సిద్ధం సభకు మొత్తం 10 లక్షలకు పైగా ప్రజలు హాజరవుతారని, సభకు వచ్చే వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు, సభ నిర్వహణకు మొత్తం 338 ఎకరాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. సభ సజావుగా జరిగేందుకు ప్రతి పోలీసు అధికారి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఐజీ మాట్లాడుతూ సిద్ధం సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరవుతున్న సందర్భంగా వాహనాలను దారి మళ్లింపు విషయంలో ప్రజలకు అర్థమయ్యేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం కమ్యూనికేషన్ సెట్‌ల ద్వారా ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు. సభకు వచ్చే వాహనాలు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా వాహనాలను వరుస క్రమంలో పార్కింగ్ చేయించాల్సిన బాధ్యత కూడా పోలీసులపై ఉందన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, ప్రకాశం జిల్లా ఎస్పీ పీ.పరమేశ్వరరెడ్డి, నెల్లూరు జిల్లా ఎస్పీ డాక్టర్ కే.తిరుమలేశ్వరరెడ్డి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



మహాశివుని విగ్రహాన్ని ఊరేగింపుగా అరవపల్లి తిరునాళ్లకు తీసుకెళ్తున్న రేపల్లె పట్టణ 28వ వార్డు యువత



అర్ధనారీశ్వరుని విగ్రహం అరవపల్లికి తరలిస్తున్న రేపల్లె పట్టణానికి చెందిన మహాశివ యువత



వివిధ రకాల చామంతులతో శివలింగం ప్రభను తరలిస్తున్న నెల్లూరువారిపాలెం గ్రామస్తులు



విద్యుద్దీపాల కాంతులతో అరవపల్లి బాలకోటయ్య ఆలయం

అరవపల్లికి తరలిన ప్రభలు

మహాశివరాత్రిని పురస్కరించుకుని అరవపల్లి శ్రీ బాలకోటేశ్వరస్వామి తిరునాళ్లకు పరిసర ప్రాంతాలు, గ్రామాల నుంచి తరలివెళ్లిన ప్రభలు ఆకట్టుకున్నాయి. భక్త బృందాల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ప్రభలను ఊరేగింపుగా అరవపల్లి తరలించారు. మహాశివుడి విగ్రహంతో పాటు మంచు ముద్దలతో తయారు చేసిన శివలింగం, అర్ధనారీశ్వరుని విగ్రహాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి తిరునాళ్లకు తరలించారు.

– రేపల్లె రూరల్

రాష్ట్ర పన్నుల శాఖ డీసీటీవో సస్పెన్షన్

పాత గుంటూరు: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రభుత్వ ఆదాయానికి భారీస్థాయిలో నష్టం కలిగించిన బ్రాడీపేట సర్కిల్ డీసీటీవో ఎ.మంజులను సస్పెండ్ చేస్తూ ఈనెల 7వ తేదీన రాష్ట్ర పన్నుల ముఖ్య కమిషనర్ గిరిజాశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. శాఖ బ్రాడీపేట సర్కిల్‌లో జరిగిన ట్రేడర్స్ అక్రమాలు, అధికారుల విధుల నిర్లక్ష్యంపై గతేడాది ఆగస్టులో సాక్షిలో ప్రచురితమైన కథనంపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే... నగరంలోని మహేంద్ర కాటన్ ట్రేడర్స్ రూ.4.42 లక్షలు పన్నులు చెల్లించకపోయినా ట్రేడర్స్‌పై చర్యలు తీసుకోకుండా అధికార దుర్వినియోగంతో ఇచ్చిన నోటీసును రద్దు పరుస్తూ డీసీటీవో ఆర్డర్ పాస్ చేశారు. ఇటువంటి ఆర్డర్లను పాస్ చేయాలంటే ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే జారీ చేసిన ఆర్డర్ వలన ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లింది. దీనిపై స్పందించిన గుంటూరు-2 డివిజన్ జాయింట్ కమిషనర్ బ్రాడీపేట అసిస్టెంట్ కమిషనర్‌తో ఆడిట్ చేయించగా మొత్తం రూ.10 కోట్లు ఆ డీలర్ ప్రభుత్వానికి ఎగనామం పెట్టినట్లు తేలింది. దీంతో డెప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ మంజులను సస్పెండ్ చేసినట్లు బ్రాడీపేట సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ వివేక్ ఆనంద్ తెలిపారు.

క్లుప్తంగా

ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్సులో ఉషాకిరణ్‌కు చోటు



చీరాల టౌన్: ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానిక రామ్ నగర్‌లోని ఎబినేజర్ ప్రార్థన మందిరం పాస్టర్ ఉషాకిరణ్‌కు చోటు లభించింది. విజయవాడకు చెందిన హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు దండంగి అగస్టీన్ నేతృత్వంలో సికింద్రాబాద్‌లోని సెయింట్ థామస్ చర్చిలో ఎలక్ట్రికల్ కీ బోర్డును వాయిస్తూ.. 300 మంది విద్యార్థులు పాటలు చక్కగా పాడటంతో ఈ ఘనత సాధించారు. ఈ బృందానికి వక్తగా వ్యవహరించిన పాస్టర్ ఉషాకిరణ్ కూడా అందులో చోటు దక్కింది. దీంతో చీరాలలోని పలువురు పాస్టర్లు ఆమెను అభినందించారు.

సంక్షేమాన్ని అందించిన ఘనత సీఎం జగన్‌దే

'గడప గడపకు మన ప్రభుత్వం'లో సమన్వయకర్త కరణం వెంకటేష్



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న సమన్వయకర్త కరణం వెంకటేష్

చీరాల టౌన్: అభివృద్ధి, సంక్షేమాన్ని అందించిన ఘనత చరిత్రలో సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కరణం వెంకటేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని కావూరివారిపాలెం, గవినివారిపాలెం గ్రామ పంచాయతీల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. వివిధ పథకాల లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును వారి మాటల్లోనే తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరిందని వారు వివరించారు. ఈ సందర్భంగా కరణం వెంకటేష్ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ అన్ని సామాజిక వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, రాజకీయ ప్రాధాన్యం కల్పించారన్నారు. మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు చేపడితేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందరికీ లభిస్తాయని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీల కల్లబొల్లి హామీలను ప్రజలు విశ్వసించరన్నారు. గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేస్తూ.. ప్రజల ముంగిటకే సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా పథకాలను అందించి, సుస్థిర పాలన చేస్తున్న జగనన్నే మళ్లీ సీఎం పీఠం అధిరోహిస్తారని చెప్పారు. అందుకు ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో సీఎంగా జగనన్నను, చీరాల ఎమ్మెల్యేగా తనను గెలిపించుకునేందుకు సిద్ధం కావాలన్నారు. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కరణం వెంకటేష్ భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు అంకాళరెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.రాజ్‌కుమార్, ఆర్బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బోయిన కేశవులు, రత్నారెడ్డి, నాగిరెడ్డి, జ్వాలా నరసింహం, సువార్త, అక్కల శ్రీనివాసరెడ్డి, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి దేవస్థాన అభివృద్ధి పనులు ప్రారంభం



శిలాఫలకాలను ఆవిష్కరించిన సమన్వయకర్త చిన హనిమిరెడ్డి, భద్రారెడ్డి

అద్దంకి రూరల్: చిన కాశీగా పిలువబడే ప్రసిద్ధ శైవక్షేత్రం మణికేశ్వరంలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ముఖ్య అతిథులుగా అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి హాజరయ్యారు. దేవదాయ ధర్మదాయ శాఖ రూ.20 లక్షల నిధులతో చేపట్టనున్న దేవస్థాన దక్షిణం, తూర్పు ప్రహరీ, టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ రూ. 25 లక్షల నిధులతో రాజగోపురం రెండో ద్వారం శంకుస్థాపనలను, దాతల సహకారంతో నిర్మించిన పురాణ కాలక్షేప మండపాన్ని ప్రారంభించారు. స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో వైవీ భద్రారెడ్డి మాట్లాడుతూ దేవస్థాన అభివృద్ధికి తమ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, దేవస్థాన అభివృద్ధి కమిటీ చైర్మన్ ఈదా విజయలక్ష్మీ శ్రీనివాసరెడ్డి, జజ్జర ఆనందరావు, ఎ. శ్రీనివాసరావు, జువ్వి రాము, ఎం.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు

200 మందికి పైగా కార్యకర్తలు చేరిక



వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న సమన్వయకర్త యడం బాలాజీ

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని పెద్ద నక్కలపాలెం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ రావిపూడి శ్రీనివాస్, సర్పంచ్ రావిపూడి వేణుబాబును పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త యడం బాలాజీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వారి ప్రధాన అనుచరులు చిలుకూరి కోటేశ్వరరావు, బాచిన సురేష్ బాబు, చిలుకూరి రాఘవయ్య, రావిపూడి రామకృష్ణ, షేక్ మీరావలి, షేక్ ఆదాం సాహెబ్, మురవుల ఏడుకొండలు, ఉప్పలపాటి సుబ్బారావు, యగ్రమాను పాపారావుతో పాటు సుమారు 200 మంది టీడీపీ కార్యకర్తలు పార్టీలో చేరారు. అనంతరం సమన్వయకర్త యడం బాలాజీ మాట్లాడుతూ.. ఐక్యంగా పార్టీ గెలుపు కోసం కృషి చేద్దామని, నియోజక వర్గంలో పార్టీ విజయబావుట ఎగురవేసి, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



దాచేపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ దాసరి శివనాగరాజు చెప్పిన వివరాలు.. ప్రకారం సయ్యద్ జమాల్(46) మనుమరాలు శుభ కార్యక్రమానికి ద్విచక్రవాహనంపై జానీబాషా(45)తో కలసి తెలంగాణ వెళుతున్నారు. దాచేపల్లి మండలం తంగెడ సమీపంలోని భవ్యసిమెంట్ ఫ్యాక్టరీ వద్ద వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డారు. ఇదే సమయంలో వెనుకగా వస్తున్న లారీ వీరిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ నారాజు మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విలువలతో కూడిన విద్యతోనే సమాజాభివృద్ధి

- మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు
- ఘనంగా పాటిబండ్ల సీతారామయ్య పాఠశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు, వేదికపై శివాజీ, మల్లికార్జునరావు, విష్ణువర్ధన్

గుంటూరు ఎడ్యుకేషన్: క్రమశిక్షణతో కూడిన విద్యతో సమాజంలో అభివృద్ధి సాధ్యమని, విద్యార్థుల్ని సన్మార్గంలో పయనింపజేయడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమష్టిగా కృషి చేయాలని మిజోరం రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. సమాజంలో విలువల్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు మరింతగా కృషి చేయాలని చెప్పారు. లక్ష్మీపురంలోని పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను అందించాలనే ఆశయంతో లాం గ్రామంలో పాఠశాలను స్థాపించిన పాటిబండ్ల సీతారామయ్య ఆశయాలకు అనుగుణంగా గుంటూరు నగరంలో ఆయన పేరుతో నెలకొల్పిన పాఠశాల విద్యాభివృద్ధిలో తన వంతు భాగస్వామ్యం అందిస్తోందని ప్రశంసించారు. విద్యారంగాభివృద్ధికి పాఠశాల, వ్యవసాయాభివృద్ధి కోసం లాం ఫారంలో సొంత స్థలాన్ని వ్యవసాయ వర్సిటీ స్థాపన కోసం దానం చేశారని చెప్పారు. రైతాంగం మేలు కోరిన సీతారామయ్య సమాజ దార్శనికుడని కొనియాడారు. ఆయన ఆశయాలకు నిలువుటద్దంగా విద్యారంగంలో సీతారామయ్య పాఠశాల ప్రగతి పథంలో పయనిస్తోందని తెలిపారు. తక్కువ ఫీజులో కార్పొరేట్ విద్యను అందిస్తున్న సీతారామయ్య పాఠశాల ఎందరో విద్యార్థుల్ని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిందని చెప్పారు. పాఠశాల పాలకవర్గ గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యకు సీతారామయ్య పాఠశాల చిరునామాగా నిలిచిందన్నారు. పాలకవర్గ అధ్యక్షుడు దేవినేని మల్లికార్జునరావు మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో విలువలతో కూడిన విద్య అందిస్తున్నామని చెప్పారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యాబోధనలో సుశిక్షితులైన ఉపాధ్యాయ బృందంతో తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థుల్ని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో గన్నమనేని విజయలక్ష్మి, పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తెనాలి డబుల్ హార్స్ తాజా ఉత్పత్తి 'చిరుధాన్యాల లడ్డూ'

అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ఆవిష్కరణ




చిరు ధాన్యాల లడ్డూ ప్యాకెట్

తెనాలి: ఆహార పరిశ్రమలో దేశవిదేశాల్లో గుర్తింపు పొందిన తెనాలి డబుల్ హార్స్‌కు అనుబంధ సంస్థ అయిన తెనాలి డబుల్ హార్స్ ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ తన తాజా ఉత్పత్తి 'చిరుధాన్యాల లడ్డూ' (మిల్లెట్ లడ్డూ)ను ఆవిష్కరించింది. మహిళా సాధికారత, ఉపాధిపై కంపెనీకి గల అంకితభావాన్ని ప్రతిబింబిస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మేనేజింగ్ డైరెక్టర్ మునగాల మోహన్‌శ్యాంప్రసాద్, డైరెక్టర్ లలిత, కంపెనీ ఉద్యోగులతో కలిసి ఈ ఉత్పత్తిని ఆవిష్కరించారు. శ్రామికశక్తిలో మహిళల పాత్రను ప్రోత్సహించే దృక్పథంతో స్థాపించిన తెనాలి డబుల్ హార్స్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ టీడీహెచ్ దిగ్గజ ఉత్పత్తి 'సున్నుండలు'తో తన ప్రయాణాన్ని ఆరంభించిన విషయం తెలిసిందే. మూడేళ్లలో ఉత్పత్తి శ్రేణిని విస్తరించింది. మొత్తం 40 రకాల్ని ప్రారంభించింది. తాజాగా ఆవిష్కరణ చేసిన పోషకమైన, రుచికరమైన ఉత్పత్తి చిరుధాన్యాల లడ్డు, సంస్థ ఉద్యోగుల అంకితభావానికి నిదర్శనమని తెలిపారు. ప్రిజర్వేటివ్స్, ఫ్లావర్స్ లేకుండా స్వచ్ఛమైన రుచితో వినియోగదారులను ఆకట్టుకుంటుందని వివరించారు.

త్రికోటేశ్వరుని సన్నిధికి తరలిన ప్రభలు




బరంపేట బాలసంఘం ప్రభ



ప్రశాంతినగర్ యూత్ ప్రభ

నాలోన శివుడు.. నీలోన శివుడు.. కొండపైనా శివుడు... మదినిండుగా పరమశివుడంటూ భక్తుల శివనామస్మరణతో శుక్రవారం రాత్రి ప్రభలు శ్రీత్రికోటేశ్వరుని సన్నిధికి తరలివెళ్లాయి. కోటప్పకొండ ఆలయం వద్ద జాగరణలో కొలువు తీరనున్నాయి. తీన్‌మార్ డప్పులు, డీజే సౌండ్స్, యువకుల నృత్యాలతో పట్టణంలో సందడి నెలకొంది. ప్రభల అలంకరణతో వివిధ గ్రామాల వారు పోటీ పడ్డారు. భారీ విద్యుత్ ప్రభలను పోలీసులు సూచనల మేరకు తరలించారు. కోటప్పకొండ తిరునాళ్లకు వెళ్లేందుకు గ్రామాల నుంచి తరలివచ్చిన యాత్రికులతో బస్టాండ్, చిత్రాలయ సెంటర్ రోడ్లు కిటకిటలాడాయి. ఉదయం నుంచి వివిధ సంస్థల ఆధ్వర్యంలో కొండకు వెళ్లే యాత్రికులకు ఉచితంగా ప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ అందజేశారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోటప్పకొండ బస్టాండ్ వద్ద ప్రయాణికుల రద్దీ కనిపించింది.

–నరసరావుపేట ఈస్ట్



రామిరెడ్డిపేట యూత్ ప్రభ



మేదరబజారు ప్రభ

క్రీస్తుని నమ్మిన వారికి నిత్య జీవం

- హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ
- రెండవ రోజు కొనసాగిన గుడారాల పండగ ప్రత్యేక ప్రార్థనలు
- దేశ విదేశాలనుంచి 4 లక్షలకు పైగా పాల్గొన్న భక్తులు



ప్రార్థనలు చేస్తున్న హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, పాస్టర్ రాజు

గుంటూరు రూరల్: ఏసుక్రీస్తుని నమ్మిన వారికి ఆయన నిత్యజీవాన్ని కలుగజేస్తాడని హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ తెలిపారు. నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలోగల హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఏటా ప్రతిష్టాత్మకంగా జరిగే అంతర్జాతీయ 47వ గుడారాల పండుగ రెండవ రోజు శుక్రవారం కొనసాగింది. మచిలీపట్నానికి చెందిన పాస్టర్ మోషే ప్రత్యేక ప్రార్థన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా హోసన్న మినిస్ట్రీస్ బ్రదర్స్ సిస్టర్స్ ఆలపించిన పరిశుద్ధుడవూ, ప్రేమ పూర్ణుడవూ, ఘనమైనది నీకార్యం అనే క్రీస్తుని గీతాలు భక్తుల్ని అలరింపజేశాయి. అనంతరం క్రీస్తు వాక్యాన్ని భక్తులకు అందిస్తూ పాస్టర్ మిల్టన్ లాజరస్ మాట్లాడుతూ దేవుడు ఆయన భక్తులకు పరిశుద్ధాత్మతో కూడిన ఆరోగ్యాన్ని అందిస్తాడని తెలిపారు. క్రీస్తు భక్తులు పరిశుద్ధ హృదయాన్ని కలిగి ఉండాలన్నారు. ఒంగోలుకు చెందిన పాస్టర్ రాజు ఉపదేశాన్ని అందిస్తూ దేవుని సంఘం పరిశుద్ధత కలిగి ఉండాలన్నారు. పరిశుద్ధమైన మనస్సుతో ఆయన్ను స్తుతించాలని తెలిపారు. క్రీస్తుని నమ్మినవారికి విజయాలు సొంతమవుతాయని చెప్పారు. మదనపల్లికి చెందిన పాస్టర్ రాజశేఖర్ ప్రసంగిస్తూ ఏసు క్రీస్తు భక్తుల కోసం, ప్రజల కోసం ప్రార్థన చేస్తున్నాడన్నారు. ప్రతి ఒక్కరూ తమ పాపాల్ని వదిలి మారు మనస్సు పొంది పరిశుద్ధాత్మతో జీవించాలని సూచించారు. సాయంత్రం ప్రత్యేక ప్రార్థనల్ని మచిలీపట్నానికి చెందిన పాస్టర్ రాజేష్ ప్రారంభించారు. హోసన్న మినిస్ట్రీస్ బ్రదర్స్, సిస్టర్స్ క్రీస్తు నామాన్ని ఘనపరుస్తూ క్రీస్తుని స్తుతి గీతాలు ఆలపించారు. హోసన్న మినిస్ట్రీస్ సండే స్కూల్ చిన్నారులు క్రీస్తు స్తుతి గీతాలకు అభినయించారు. అద్దంకికి చెందిన చెవిటి మూగ పిల్లలు మోనో యాక్షన్ చేశారు. బ్రదర్ అబ్రహాం క్రీస్తు సందేశాన్ని భక్తులకు అందిస్తూ ఏసు క్రీస్తు ప్రతి ఒక్కరి జీవితాన్ని పరిమళింపజేస్తాడని తెలిపారు. ఆయన నిత్య జీవనాన్ని, ప్రేమను అందజేస్తాడని చెప్పారు. పాస్టర్ జాన్ వెస్లీ మాట్లాడుతూ నీతి అనే దక్షిణ హస్తంతో క్రీస్తు భక్తులకు ఆదుకుంటాడని పేర్కొన్నారు. ఆయన కౌగిలిలో హెచ్చించి తన భక్తులకు ప్రేమను పంచుతాడని వివరించారు. రెండవ రోజు ప్రత్యేక ప్రార్థనల్లో 4 లక్షల మందికి పైగా భక్తులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు భోజన వసతి ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక ప్రార్థనలు ఆదివారం మధ్యాహ్నంతో ముగుస్తాయని తెలిపారు.

సత్రశాలలకు పోటెత్తిన భక్తులు



భ్రమరాంబికాదేవి



సత్రశాలకు కృష్ణ జలాలతో వెళ్తున్న భక్తులు



ప్రత్యేక పూజలు చేస్తున్న జిల్లా ఎస్పీ రవి శంకర్‌రెడ్డి

సత్రశాల(రెంటచింతల): గంగా భ్రమరాంబ సమేత మల్లన్నస్వామిని దర్శించుకునేందుకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచే మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మానందరెడ్డి, ఈఓ బుర్రి నెమిలిరెడ్డి పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. 45 వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఈఓ బుర్రి నెమిలిరెడ్డి తెలిపారు. అన్నదాన సత్రాలలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, జెడ్పీ వైస్ చైర్మన్ శౌరిరెడ్డి నర్సిరెడ్డి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ మోర్తల ఉమ, తహసీల్దార్ ఎస్.రామ్ మోహన్‌రావు, ఎంపీపీ పి.సంపూర్ణమ్మ, మాజీ ఎంపీపీ డి.చౌడేశ్వరి, మాజీ జెడ్పీటీసీ నవులూరి భాస్కర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కారెంపూడి సీఐ చిన్న మల్లయ్య, ఎస్ఐ కె. వెంకట నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సత్రశాలలో జిల్లా ఎస్పీ ప్రత్యేక పూజలు

సత్రశాల(రెంటచింతల): ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకు పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవి శంకర్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వారికి దేవస్థానం ఈవో బుర్రి నెమిలిరెడ్డి, దేవస్థానం చైర్మన్ బద్దూరి బ్రహ్మానందరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు చిట్యాల శివశర్మ నేతృత్వంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భ్రమరాంబికాదేవి ఆలయంలో, స్వర్ణస్ఫటిక శివలింగం వద్ద కూడా పూజలు చేశారు. ఎస్పీ వెంట ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ, కారెంపూడి సీఐ చిన్న మల్లయ్య, ఎస్ఐ కె.వెంకట నారాయణరెడ్డి ఉన్నారు.

10న రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఏపీ చెస్ అసోసియేషన్, శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన లాంలోని చలపతి కాలేజీలో రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ పోటీలు జరుగుతాయని నిర్వాహకుడు ఎం.గోపీనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం ప్రైజ్ మనీ కింద రూ.50,500తోపాటు ట్రోఫీలు అందజేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి అగ్ర చెస్ ప్లేయర్స్ పాల్గొంటారన్నారు. వివరాలకు 97030 49378 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.